క్లుప్తంగా

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత

మక్తల్: మండంలోని పలు గ్రామాలకు చెందిన 29 మంది బాధితులకు సీఎం రిలీఫ్ ఫండు చెక్కులను మక్తల్ మార్కెట్ వైస్ చైర్మన్ గణేష్‌కుమార్ సోమవారం మంత్రి వాకిటి శ్రీహరి నివాసంలో అందజేశారు. గ్రామాలకు చెందిన కొందరు అనారోగ్యంతో ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం ప్రభుత్వం నుంచి మంత్రి వాకిటి శ్రీహరి చొరవతో సీఎంఆర్ఎఫ్ మంజూరు చేయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్లు విష్ణువర్ధన్‌రెడ్డి, సురేష్, చెన్నయ్యగౌడ్, నర్సింహ, రామేశ్వర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు రఘు ప్రేమతీర్థుల 165వ జయంతి

నారాయణపేట: శ్రీ రాఘవేంద్రస్వామి ఆలయంలో మంగళవారం శ్రీ రఘు ప్రేమ తీర్థుల 165వ జయంతి ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు నరసింహ చారి తెలిపారు. ఈ ఉత్సవాల్లో భాగంగా స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు మహా రథోత్సవం ఉంటుందని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు.

ముఖ్య నాయకుల అభిప్రాయ సేకరణ



మరికల్: కాంగ్రెస్ పార్టీ నూతన జిల్లా అధ్యక్షుడు ఎన్నిక కోసం మండల కేంద్రంలోని సూర్యచంద్ర కన్వెన్షన్ హాల్లో సోమవారం మరికల్, ధన్వాడ కాంగ్రెస్ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఏఐసీసీ పరిశీలకులు కర్ణాటక ఎమ్మెల్సీ నారాయణ స్వామి హాజరయ్యారు. పార్టీ నూతన జిల్లా అధ్యక్షుడి ఎన్నికలో భాగంగా కార్యకర్తలు, నాయకుల నుంచి అభిప్రాయ సేకరణ చేపట్టారు. అనంతరం పార్టీ బలోపేతంపై చర్చించారు. కార్యక్రమంలో నాయకులు సూర్యమోహన్‌రెడ్డి, వీరన్న, నాగేశ్వర్‌రెడ్డి, కృష్ణయ్య, నిరంజన్‌రెడ్డి, రామకృష్ణ, హన్మంతు పాల్గొన్నారు.

రైతు భరోసా ఇవ్వాలి

మరికల్: ప్రభుత్వం యాసంగికి పెట్టుబడి కింద రైతు భరోసా ఇవ్వాలని బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డిలు సోమవారం ఒక సంయుక్త ప్రకటనలో కోరారు. కాంగ్రెస్ పార్టీ సాధ్యం కాని పథకాలు ప్రకటించి అధికారంలోకి వచ్చిన సీఎం రేవంత్ రెడ్డి వాటిని అమలు చేయడం కోసం రైతులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. యాసంగి సాగు సమయం దగ్గర పడుతోందని, వెంటనే ప్రభుత్వం రైతులను ఆదుకోవడానికి రైతు భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

నేడు 'రైతు నేస్తం'

నారాయణపేట రూరల్: మండలంలోని జాజాపూర్, పేరపల్ల గ్రామాల్లో రైతు నేస్తం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి దినకర్ తెలిపారు. మంగళవారం ఉదయం తొమ్మిది గంటలకు ఆయా గ్రామ రైతువేదికల్లో కపాస్ కిసాన్ యాప్ నియమ నిబంధనలపై అవగాహన కల్పిస్తామని, పత్తి కొనుగోలుపై చర్చిస్తామని తెలిపారు.

గీతా కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఊట్కూరు: ప్రభుత్వం గీతా కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కల్లు గీతా కార్మికుల సంఘం జిల్లా కన్వీనర్ మహేష్‌గౌడ్ డిమాండ్ చేశారు. బిజ్వార్‌లో సోమవారం విలేకర్లతో మాట్లాడారు. కల్లుగీతా కార్మికుడు సహజ మరణం పొందితే ప్రభుత్వం రూ.5 లక్షలు ఆర్థిక సహాయం అందించాలని కోరారు. కల్లు సొసైటీకి 5 ఎకరాల భూమిని కేటాయించాలని, నీటి వసతి కలిపించాలని, గీతా కార్మికుడికి రూ.4 వేల పింఛన్ అందించాలని కోరారు. సమావేశంలో గౌడ సంఘం నాయకులు రవిగౌడ్, వెంకటప్పగౌడ్, సురేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టిన కారు

కొత్తపల్లి: మండలంలోని కొత్తపల్లి శివారులో కారు విద్యుత్ స్తంభానికి ఢీ కొట్టి పల్టీ పడిన సంఘటన సోమవారం కొత్తపల్లి–గుండుమాల్ రహదారిలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. జడ్చర్లకు చెందిన శ్రీనివాస్ ఏడాది కాలంలో గుండుమాల్ మైనింగ్‌లో పని చేస్తున్నాడు. ఈ క్రమంలో కొత్తపల్లి మండలంలోని గోకుల్‌నగర్ గ్రామానికి చెందిన కావలి రవి దగ్గర రెండు నెలల క్రితం ఆర్థిక లావాదేవీల నిమిత్తం శ్రీనివాస్ కారు అక్కడే ఉంచాడు. ఈ రోజు కారును తీసుకొస్తున్న క్రమంలో కొత్తపల్లి గ్రామానికి చెందిన మున్నూరు వెంకటయ్య టీవీఎస్ ఎక్స్ఎల్‌ను రోడ్డుపై ఉంచి పొలంలోకి వెళ్లాడు. కారు అదుపుతప్పి ఎక్స్ఎల్‌ను ఢీకొట్టింది. అక్కడి నుంచి రోడ్డు పక్కనే ఉన్న 33/11 కేవీ విద్యుత్ స్తంభానికి కారు వేగంగా ఢీ కొట్టడంతో విద్యుత్ స్తంభం రెండు ముక్కలైంది. కారు మూడు పల్టీలు కొట్టింది. కారులో శ్రీనివాస్‌కు గాయాలు కావడంతో ప్రైవేటు వాహనంలో ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. విద్యుత్ స్తంభం విరిగి పడడంతో చాలా సేపు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

'ఇందిరమ్మ'కు ఉపాధి హామీ

- ఈజీఎస్‌తో అనుసంధానం
- 90 రోజులు పనిదినాలు కల్పించేలా చర్యలు
- నిర్మాణ పనుల వేగానికి సర్కారు కసరత్తు



కొత్తపల్లిలో ఇంటి నిర్మాణం పరిశీలిస్తున్న అధికారులు

మద్దూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో పనులు వేగవంతానికి కసరత్తు ప్రారంభించింది. ఇందు కోసం ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ఉపాధి హామీని అనుసంధానం చేసింది. ఇందిరమ్మ ఇంటి నిర్మాణం చేసుకునే లబ్ధిదారు జాబ్‌కార్డు కల్గి ఉంటే 90 రోజులు పనిదినాలు కల్పించేలా చర్యలు చేపట్టింది. ఇంటి నిర్మాణానికి కూలీల కొరత లేకుండా సదరు లబ్ధిదారు పని చేసుకుని కూలీ పొందనుండడంతో పనులు వేగవంతంగా సాగే అవకాశాలున్నాయి.

మొదలైన ప్రక్రియ

జిల్లాలోని 13 మండలాల్లో ఒక్కో గ్రామాన్ని ఎంపిక చేసి పైలెట్ ప్రాజెక్టుగా ఇందిరమ్మ ఇంటి నిర్మాణం ప్రారంభించారు. అనేక గ్రామాల్లో నిర్మాణం నత్తనడకనే సాగుతుండడంతో పనులు వేగవంతం చేసేందుకు ప్రభుత్వం ఉపాధి పథకం అనుసంధానం చేసింది. ఈ క్రమంలో ఆయా గ్రామాల్లో ఇంటి నిర్మాణ దశలను పరిశీలించి గుర్తింపు ప్రక్రియను ప్రారంభించారు.

జిల్లాలో 102 ఇళ్ల గుర్తింపు..

జిల్లాలోని అన్ని మండలాల్లో ఉపాధి హామీ పథకం కింద ప్రస్తుతం 102 ఇళ్లను గుర్తించారు. ఇంటి నిర్మాణంలో బేస్‌మెంట్ స్థాయి, గోడల నిర్మాణం, స్లాబ్ లేవల్ వరకు జరిగిన ఇళ్లను ఎంపిక చేశారు. ఈ స్థాయిలో ఉన్న ఇళ్ల లబ్ధిదారు ఈజీఎస్ పనులకు వెళ్లకుండా ఇంటి నిర్మాణ పనులకు రోజూ మస్టర్ వేసి కూలీ చెల్లించనున్నారు. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వెలువడిన తర్వాత ఉపాధి హామీ పథకం సిబ్బంది జిల్లాలోని అన్ని మండలాల్లో ఇప్పటి వరకు స్లాబ్ లేవల్లో ఉన్న ఇళ్లను 53 గుర్తించారు. గోడల నిర్మాణంలో ఉన్న 49 ఇళ్లను గుర్తించినట్లు అధికారులు తెలిపారు.

90 రోజుల పనిదినాలు..

ఇందిరమ్మ ఇంటి నిర్మాణం మొదలు పెట్టి ఉపాధి హామీలో జాబ్ కార్డు ఉన్న లబ్ధిదారుకు బేస్‌మెంట్ స్థాయి వరకు 40రోజులు, స్లాబ్ లేవల్ వరకు 50 రోజుల పనిదినాలు కల్పించనున్నారు. 90 రోజుల పనిదినాలకు సదరు లబ్ధిదారుకు రూ.27,630 చెల్లించనున్నారు. దీంతో సొంతింటి నిర్మాణానికి కూలీ పని చేసుకుని లబ్ధిపొందే అవకాశం ప్రభుత్వం కల్పించినట్లు అయింది.

102 ఇళ్లను గుర్తించాం..



జిల్లాలో అన్ని మండలాల్లో కలిపి 102 ఇళ్లను గుర్తించాం. ఉపాధి హామీ జాబ్‌కార్డు కల్గిన లబ్ధిదారు ఇంటి నిర్మాణానికి అవసరమైన పనులు చేసుకోవాలని అందుకు మస్టర్ వేస్తామని చెప్పాం. 90 రోజుల పని దినాలు కల్పించి వారి ఖాతాలో వేతనాలు జమ చేస్తాం. ఈ డబ్బులు కూడా ప్రభుత్వం మంజూరు చేసినా రూ.5లక్షల లోపు ఉంటుంది.

– మొగులప్ప, డీఆర్‌డీఏ, పీడీ, నారాయణపేట

స్పందించారు.. తొలగించారు..

సాక్షి ఎఫెక్ట్..



పళ్ల హనుమాన్ మందిరం సమీపంలో చెత్తను తొలంగించిన మున్సిపల్ కార్మికులు



ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ పక్క భాగంలో చెత్తను జేసీబీతో తొలగిస్తున్న కార్మికులు

నారాయణపేట టౌన్: సోమవారం 'సాక్షి' దినపత్రికలో చెత్తను తొలగించాలి అనే శీర్షికతో ప్రచురితమైన వార్తకు మున్సిపల్ కమిషనర్ నర్సయ్య స్పందించారు. పళ్ల హనుమాన్ మందిరం సమీపంలో ఉన్న ప్రధాన కాల్వ పై భాగంలో డంపింగ్ యార్డ్‌ల పేరుకుపోయిన చెత్తాను జేసీబీ సహాయంతో తొలగించి ఆ ప్రాంతాన్ని శుభ్రం చేయించారు. దీంతో పాటు శాతవాహన కాలనీలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి పక్క భాగంలో చెత్తాను సైతం జేసీబీతో తొలగించారు. ఎన్నో నెలలుగా పేరుకుపోయిన చెత్తాను తొలగించడంలో సహాయ పడ్డ 'సాక్షి' దినపత్రికకు స్థానికులు ధన్యవాదాలు తెలిపారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి



వాహనాల తనిఖీ నిర్వహిస్తున్న ఏఎస్ఐ

నారాయణపేట రూరల్: వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని టౌన్ పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ ఆంజనేయులు అన్నారు. మండలంలోని సింగారం చౌరస్తాలో సోమవారం ముమ్మరంగా వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా సరియైన పత్రాలు లేని వాహనాలను గుర్తించి 36 కేసులు నమోదు చేసి రూ.18,500 జరిమానా విధించారు. అనంతరం వాహనదారులకు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటించడం వల్ల ప్రమాదాల తగ్గుతాయని అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని తెలిపారు. వాహనాలు నడిపే ప్రతి ఒక్కరు సరైన పత్రాలు కలిగి ఉండాలని తెలిపారు. రాష్ డ్రైవింగ్ చేయరాదని, మద్యం తాగి వాహనాలు నడపరాదని, త్రిబుల్ రైడింగ్ చేయరాదు, వాహనాలకు సంబంధించిన ఆర్సి, లైసెన్స్ ఇన్సూరెన్స్ తప్పకుండా కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో టౌన్ పోలీసులు, కానిస్టేబుల్ పాల్గొన్నారు.

నేరాల నియంత్రణే లక్ష్యం

జిల్లా కేంద్రంలో ముందస్తు నేరాల నియంత్రణ, దొంగతనాల నివారణనే లక్ష్యంగా, అనుమానిత వ్యక్తులు, పాత నేరస్తులను గుర్తించడానికి బ్లూ కోర్ట్స్ పోలీ సులు ప్రత్యేక తనిఖీ నిర్వహించారు. సోమవా రం కొత్త బస్టాండ్, పట్టణ ప్రధాన చౌరస్తాలలో టౌన్ పోలీసులు సంతోష్, రవి కుమార్లు ఫింగర్ ప్రింట్స్ డీవైస్‌తో తనిఖీ నిర్వహించారు.



బస్టాండ్ లో తనిఖీ చేస్తున్న పోలీసులు

వయోజనులను విద్యావంతులు చేద్దాం



శిక్షణలో మాట్లాడుతున్న ఎంఈఓ రాంరెడ్డి

నర్వ: ఉల్లాస్ కార్యక్రమం ద్వారా వయోజనులను విద్యావంతులుగా తీర్చిదిద్దుదామని ఎంఈఓ రాంరెడ్డి అన్నారు. సోమవారం నర్వ ప్రాథమిక పాఠశాలలో ఉల్లాస్ కార్యక్రమంపై శిక్షణ నిర్వహించారు. ఎలాంటి పాఠశాల విద్యావకాశం లేని 15 ఏళ్లు, ఆపైబడిన నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా చేసేందుకే ఈ కార్యక్రమన్నారు. ఇందులో ప్రధానంగా అవగాహనతో పాటు, చదవడం, రాయడం, కనీస సామర్థ్యాలతో కూడిన విద్య, లెక్కలు నేర్పిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో 8వ, తరగతి ఆపైన చదువుతున్న విద్యార్థులు, పట్టభద్రులు, విశ్రాంత ఉద్యోగులు, సేవాభావంతో ముందుకు వచ్చి స్వచ్ఛందంగా బోధకులుగా సామాజిక చైతన్య కేంద్రాలలో బోధిస్తారన్నారు. వలంటీర్‌గా పనిచేసే టీచర్‌గా పాల్గొనే విద్యార్థులకు విద్యా క్రెడిట్‌లను ప్రదానం చేయాలని ఏఐసీటీఈ, ఎన్‌సీటీఈ ఆదేశాలు జారీ చేసిందన్నారు. శిక్షణ కార్యక్రమంలో ఏపీఎం చంద్రశేఖర్, కాంప్లెక్స్ హెచ్ఎం సునీత, శిక్షకులు వేణుగోపాల్, వీఓఏలు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం



మద్దూరులో రోడ్డు విస్తరణ పనుల్లో మార్కింగ్ వేస్తున్న అధికారులు

మద్దూరు: పట్టణంలోని రెనివట్ల చౌరస్తా నుంచి కన్యాక పరమేశ్వరీ దేవాలయం వరకు సెంట్రల్ లైటింగ్‌తో కూడిన రోడ్డు విస్తరణ పనులను సోమవారం పీఆర్, మున్సిపల్ అధికారులు ప్రారంభించారు. స్పెషల్ డెవలప్‌మెంట్ నిధులు రూ.30కోట్ల 60 లక్షలతో మద్దూరు, రెనివట్ల, చెన్నారెడ్డిపల్లి మీదుగా మోమినాపూర్ వరకు డబుల్ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించిన్లు పీఆర్ డిప్యూటీ ఈఈ విలోక్ తెలిపారు. మద్దూరు, రెనివట్ల, చెన్నారెడ్డిపల్లి, మోమినాపూర్ గ్రామాల్లో 70 పీట్ల రోడ్డు నిర్మాణం పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్, పీఆర్ ఏఈ అంజిరెడ్డి, సందీప్‌రెడ్డి, మున్సిపల్ సిబ్బంది రామునాయక్ పాల్గొన్నారు.

ఉపాధి కూలీలు ఈకేవైసీ చేసుకోవాలి



పత్తి కూలీల దగ్గర ఈకేవైసీ నమోదు చేస్తున్న టీఏ హర్షవర్ధన్‌రెడ్డి

మాగనూర్: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో అవినీతి అక్రమాలకు చెక్‌పెట్టి, నిజమైన కూలీలకు లబ్ధి చేకూరేలా కేంద్ర ప్రభుత్వం సంస్కరణలు చేపట్టిందని మాగనూర్ ఏపీఓ మన్యం అన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అధికారులు, సిబ్బంది ఈకేవైసీ పనులో నిమగ్నమయ్యారు. రోజుకు వందమంది కూలీల ఈకేవైసీ పూర్తి చేయాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారులు టార్గెట్ విధించారు. దీంతో ఈకేవైసీకి కూలీలు ముందుకు రాపోవడంతో సోమవారం అధికారులు పోలంబాట పట్టారు. ప్రస్తుతం గ్రామాలలో వ్యవసాయ పనులు జోరుగా నడుస్తుండటంతో అధికారులు నేరుగా వారి దగ్గరకు వెళ్లి కూలీల ఫొటోలు తీసి యాప్‌లో అనుసంధానం చేస్తున్నారు. ఈ నెల 15న చివరిగా ఉండటంతో ఏమి చేయాలో అర్థం కాకా అధికారులు తలలు పటుకుంటున్నారు. గ్రామాలలో ప్రజలు ఈకేవైసీ కోసం సంబంధిత అధికారులను సంప్రదించి వేగంగా పూర్తి చేసుకోవాలని కోరుతున్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



సామూహిక సీమంతంలో పాల్గొన్న ఎంపీడీఓ

దామరగిద్ద: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమౌతుందని, గర్భిణులు పౌష్టికాహారం తీసుకుంటే పుట్టబోయే పిల్లలు ఆరోగ్య వంతులుగా ఉంటారని ఎంపీడీఓ సాయిలక్ష్మి, ఎంఈఓ కృష్ణారెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోషణమాసం కార్యక్రమానికి వారు హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రూప, హెల్త్ సూపర్‌వైజర్, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, గర్భిణులు కిశోరబాలికలు పాల్గొన్నారు.

షోరూంలో రూ.100 చోరీ

మక్తల్: మక్తల్ పట్టణంలో ఎల్ఎస్‌హోండా షోరూంలో ఆదివారం రాత్రి చోటుచేసుకున్న సంఘటన సోమవారం వెలుగు చూసింది. వివరాలు ఇలా ఉన్నాయి.. మక్తల్‌లో 167 రహదారి పక్కన హోండా షోరూం వెనుక భాగంలో బాత్ రూం నుంచి గుర్తు తెలియని వ్యక్తులు తాళం కట్ చేసి డోర్‌ను విరగొట్టారు. తర్వాత గోడకు రంధ్రం చేసి లోపలికి ప్రవేశించారు. మొదట హార్డిస్క్ తీసుకొని అక్కడే ఉంచారు. అనంతరం లోపలికి ప్రవేశించి బీరువాలును విరగొట్టారు. కాగితాలు మాత్రమే ఉండటంతో మిగతా బీరువాలో రూ.100 ఉండటంతో అవి తీసుకెళ్లారు. ఉదయం షోరూంకు వచ్చిన యజమాని మేఘారెడ్డి డోరు ఓపెన్ చేసి చూడగా బీరువాలు తెరిచి కాగితాలు చిందరవందరగా కనిపించాయి. వెంటనే మక్తల్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకోని సంఘటనా వివరాలు తెలుసుకున్నారు. ఈనెల 10న ఓ బంగా రు షాపులో చోరీ చేసేందుకు ప్రయత్నించగా, అక్కడ ఏమీ దొరకక పోవడంతో దుండగులు అవక్కాయ్యారు. దొంగల వల్ల పట్టణ ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ఉత్తమ రైతుకు సన్మానం

నారాయణపేట రూరల్: పీఎం ధన ధాన్య కృషి యోజన పథకం ప్రారంభోత్సవంలో పాల్గొనేందుకు ఢిల్లీ వెళ్లి వచ్చిన మక్తల్ నియోజకవర్గం గొల్లపల్లి గ్రామ రైతు కురుమయ్యను సోమవా రం జాజాపూర్ రైతు వేదికలో అన్నదాతలు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీకే ఎస్ నాయకులు వెంకోబ, మక్తల్, ఊట్కూర్, నారాయణపేట, దామరగిద్ద మండలాల రైతులు పాల్గొన్నారు.



ఉత్తమ రైతును సన్మానిస్తున్న రైతులు

ప్రారంభమైన చౌడేశ్వరీదేవి ఉత్సవాలు



కోస్గి: తొగుట వీర క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో చౌడేశ్వరీ దేవి ఆఖండ జ్యోతి ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రాంభమయ్యాయి. పట్టణంలోని ఇసుకబావి సమీపంలో వెలసిన అమ్మవారికి పంచమృతాభిషేకం, మహామంగళహారతి, జల్దిబిందె కార్యక్రమం చేపట్టారు. మంగళవారం రోజు చౌడేశ్వరీ దేవి అఖండ జ్యోతిని పట్టణంలోని పురవీధుల గుండా ఆటపాటలతో తిప్పుతారు. కార్యక్రమంలో శశిధర్, అజయ్‌కుమార్, శ్రీనివాస్, బాల్‌రాజ్, నర్సింహులు, లక్ష్మీనారాయణ, విజయ్ కుమార్ ఉన్నారు.

జిల్లా స్థాయి గో విజ్ఞాన పరీక్షలు

కోస్గి రూరల్: శ్రీ జ్ఞానపీఠం స్థాపించి 51 ఏళ్లు పూర్తయిన సందర్భంగా దేశీవాళి ఆవు అనే అంశంపై సోమవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లా స్థాయి గో విజ్ఞాన పరీక్షలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యర్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ శ్రీనివాసులు, మండల వ్యవసాయాధికారి రామకృష్ణ, నిర్వహకులు రఘోత్తమాచార్యులు ఉన్నారు.

ఆర్టీసీ నూతన ఎండీని కలిసిన కార్మికులు



నారాయణపేట రూరల్: ఆర్టీసీ నూతన ఎండీగా బాధ్యతలు చేపట్టిన నాగిరెడ్డిని సోమవారం పేట డిపో కార్మికులు, వివిధ యూనియన్ నాయకులు కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సన్మానించి బొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మహబూబ్ నగర్ రీజియన్, నారాయణపేట డిపోలో నెలకొన్న సమస్యలను వివరించారు. కార్యక్రమంలో ఐఎన్టీయూసీ, ఎస్డబ్ల్యూయు రాష్ట్ర కమిటీ సభ్యులు రాజిరెడ్డి, సాయి రెడ్డి, అహ్మద్ ఖాన్, ముజీబ్ తో పాటు స్థానిక డిపో నాయకులు మధు, రాజవర్ధన్ రెడ్డి, మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

న్యాయమూర్తిపై దాడి సరికాదు



నారాయణపేట రూరల్: సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్‌పై జరిగిన దాడిని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి మంద నరసింహ ఖండించారు. సోమవారం పట్టణ ప్రధాన రహదారిపై నల్లబ్యాడ్జీలతో నిరసన ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోలీసులు వెంటనే చట్టపరమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. బాధ్యులపై కేసు నమోదు చేసి శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎం ఎస్ పీ, బీహెచ్‌పీఎస్, ఎంఈఎఫ్, ఎంఎస్ఎఫ్, ఎంఎంఎస్, ఎంజెఎఫ్, ఏం ఎల్ ఎఫ్ అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పేట వాసులకు రాష్ట్రస్థాయి పురస్కారాలు



జిల్లా వాసులను సన్మానిస్తున్న ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ పురుషోత్తం

నారాయణపేట రూరల్: ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని ట్రస్మా ఆధ్వర్యంలో అందించిన రాష్ట్ర బెస్ట్ టీచర్ అవార్డులకు నారాయణపేట జిల్లా వాసులు ఎంపికయ్యారు. ఈ మేరకు ఆదివారం రాత్రి హైదరాబాద్ పంజగుట్ట ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో స్థానిక కృష్ణగోకులం కరస్పాండెంట్ కే.సుదర్శన్ రెడ్డి, శ్రీహంసవాహిని స్కూల్ కరస్పాండెంట్ రాజేష్ కుమార్ రాష్ట్ర ఉన్నత మండలి వైస్ చైర్మన్ పురుషోత్తం చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షులు శివరాత్రి యాదగిరి, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరరావు, కోశాధికారి జయసింహ గౌడ్, గౌరవ అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు ఉత్తమ ఉపాధ్యాయులను శాలువాతో సన్మానించి, బొకే, జ్ఞాపిక అందజేశారు.

అత్యాచార నిందితుడిని కఠినంగా శిక్షించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సాయికుమార్

నారాయణపేట రూరల్: కూలీ పని పేరుతో మహిళపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు శారద, పీడీఎస్ యూ జిల్లా అధ్యక్షులు సాయికుమార్ డిమాండ్ చేశారు. సోమవారం భగత్‌సింగ్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. మెదక్ జిల్లాలో కూలి పని ఇప్పిస్తానని మాయమాటలు చెప్పి మహిళలను నిర్మానుష ప్రదేశానికి తీసుకువెళ్లి చిత్రహింసలకు గురి చేస్తూ అత్యాచారం చేసిన నిందితుడిని వెంటనే అరెస్టు చేసి చట్టపరంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. వెంటనే ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు నిందితుడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో అజయ్, కృష్ణ, వెంకటేష్, మహేష్, నందిని, రాజు, అరవింద్, అభి, నరసింహ, అనూష, నందిని, హారిక, మనిషా, పూజ, కవిత పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పరిశీలన

కొత్తపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ఎంపీడీఓ కృష్ణారావు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ సోమవారం పరిశీలించారు. మండల కేంద్రంలో 21ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, 15 ఇళ్లు కొనసాగుతున్నట్లు తెలిపారు. మిగిలిన ఆరు ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు వారి ఆర్థిక పరిస్థితి బాగలేక ప్రారంభించలేదని తెలిపారు. మొదటి విడతలో 15 మంది లబ్ధిదారులకు వారి ఖాతాల్లో జమ అయినట్లు తెలిపారు. వర్షాల తో ఆగిపోయిన ఇంటి నిర్మాణాలు వేగవంతం చేసే లా ప్రతి పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో ప ర్యవేక్షించి ఎప్పటికప్పుడు నివేదికలు సమర్పించాలని ఆదేశించారు.

ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం



నారాయణపేటలో ప్రధాని,ఎంపీ చిత్ర పటాలకు పాలాభిషేకం చేస్తున్న నాయకులు



మద్దూరులో మోదీ, డీకే అరుణ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు



మరికల్‌లో ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

నారాయణపేట రూరల్: ప్రధాని నరేంద్రమోదీ పీఎం ధన్ ధాన్య కృషి యోజన పథకం ప్రారంభించడంతో సోమవారం జిల్లా కేంద్రంలో బీజేపీ నాయకులు కార్యకర్తలు ప్రధాని నరేంద్రమోదీ, ఎంపీ డికె. అరుణ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ జిల్లాను ఎంపిక చేసి రైతులకు 36 రకాల పథకాలను సబ్సిడీతో ఇచ్చి రూ.1440 కోట్లు ఆరు సంవత్సరాల వరకు పాడి పశువులకు, పప్పు ధాన్యాలకు, పండ్ల తోటలు మొదలైన పంటల రైతులకు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కెంచే శ్రీనివాసులు, జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీగౌడ్, జ్యోతి, నాయకులు పాల్గొన్నారు.

మద్దూరు: నారాయణపేట జిల్లా రైతుల ఆదాయం పెంచే దిశగా ప్రధాన మంత్రి మోదీ, డీకే అరుణ మన జిల్లాను 'ప్రధాన మంత్రి ధన్ ధాన్య కృషి యోజన'(పీఎండీడీకేవై) పథకంలో చేర్చారని బీజేపీ నాయకులు తెలిపారు. పట్టణంలోని పాతబస్టాండ్ చౌరస్తాలో మోదీ, డీకే అరుణ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు.

కొత్తపల్లి: మండల కేంద్రంలో ప్రధాని చిత్రపటానికి కొత్తపల్లి మండల బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బీజేపి రాష్ట్ర కార్యదర్శి ప్రతాప్ రెడ్డి మాట్లాడారు.

కోస్గి రూరల్: పట్టణంలోని శివాజీ చౌరస్తాలో దేశ ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

మరికల్: బీజేపీ ఆధ్వర్యంలో తెలంగాణ చౌరస్తాలో ప్రధాని నరేంద్రమోదీ, ఎంపీ డీకే అరుణ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు.